క్లుప్తంగా

తాగునీరు అందించాలంటూ నిరసన

ప్రత్తిపాడు: చెరువులో ఉన్న నీళ్ల మీరు అమ్ముకుని, ఇప్పుడు మా గొంతు ఎండగడతారా అంటూ.. మహిళలు పంచాయతీ అధికారులపై నిప్పులు చెరిగారు. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన కొందరు నాయకులు మంచినీటి చెరువుల్లో ఉన్న నీటిని కొద్ది రోజుల క్రితం పొలాలకు అమ్ముకున్నారు. దీంతో భూమిలో తేమశాతం తగ్గి బావుల్లో ఊటపడిపోయి, మోటర్లు వేసుకున్నప్పటికీ బావుల నుంచి నీరు రాని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో తాగేందుకు నీరు లేకపోవడంతో పాటు కనీసం మూగ జీవాల గొంతు తడింపేందుకు కూడా నీరు అందని దుస్థితి చోటుచేసుకోవడంతో మహిళలు సోమవారం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. మనుషులకు ఎలాగూ నీళ్లివ్వలేకపోతున్నారు.. కనీసం మూగజీవాలకు కూడా నీళ్లు లేకుండా చేశారంటూ నిప్పులు చెరిగారు. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మహిళలకు నచ్చజెప్పి పంపారు.

ఇళ్ల వద్దకు ఫారం 12డీ దరఖాస్తులు

తహసీల్దార్ ఎం. పద్మజ



ప్రత్తిపాడు: ఇంటి వద్ద నుంచే 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం. పద్మజ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ బీఎల్ఓలతో హోం ఓటింగ్ విధానంపై సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 85 సంవత్సరాలు నిండిన ఓటర్లతో పాటు పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి నుంచే ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా వినియోగించుకోవచ్చని చెప్పారు. విషయాన్ని గ్రామాల్లో ఉన్న 85 ఏళ్లు నిండిన ఓటర్లు, పీడబ్ల్యూడీ ఓటర్లు వద్దకు బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఆసక్తి ఉన్న వారికి 12డీ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. హోం ఓటింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలనుకునే వారికి మే నెలలో నిర్ణీత తేదీలలో స్పెషల్ ఓటింగ్ టీంల ద్వారా పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పిస్తారని పద్మజ వివరించారు. బీఎల్ఓలు, సూజర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



ప్రచారంలో భాగంగా దోసెలు వేస్తున్న అంబటి మురళీకృష్ణ



రోడ్డుపై కూర్చుని వృద్ధురాలికి భరోసా కల్పిస్తున్న అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- పొన్నూరులో ఎన్నికల ప్రచారం

పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, పార్టీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పొన్నూరు పట్టణంలోని 6,7 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంబటి మురళీకృష్ణకు వార్డు నాయకులు ఘనస్వాగతం పలికారు. తొలుత అంబటి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రజలను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిరు వ్యాపారులతో మమేకమయ్యారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తానని తనకు అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని అంబటి మురళీకృష్ణ ఓటర్లను అభ్యర్థించారు. పొన్నూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజల కోసం ఒక్క మంచిపని కూడా చేయనివారు ఓట్ల కోసం మళ్లీ మీ ముందుకు వస్తారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఓటు అనే వజ్రాయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 58 నెలల కాలంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఈ ఐదేళ్ల ప్రజా సంక్షేమం కోసం బటన్ నొక్కిన సీఎం జగన్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు వడ్రాణం ప్రసాదు, బొనిగల వేణుప్రసాద్, షేక్ నాజర్, దాసరి శివరామకృష్ణ, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, బోయి నాగరాజు, వట్టిప్రోలు రంగారావు, దేవరకొండ గోపి, ఆరేటి మధుసూదనరావు, పి.సుబ్బారావు, గాజుల సత్యనారాయణ, వాకా సాయి, తుపాకుల పతి, దాసరి శ్రీనివాసరావు, చాంద్‌బాషా, బోయిన శివశంకరరావు, మూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 60 కుటుంబాలు..

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా ఏకమవుతున్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమానికి ఆకర్షితులైన పార్టీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని డీవీసీ కాలనీకి చెందిన 60 కుటుంబాలు వార్డు కన్వీనర్ ఆరేటి మధు, షేక్ చాంద్ బాష, గాజుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

విజయమే లక్ష్యం కావాలి..

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులంతా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో సోమవారం అన్ని గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు.

– చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో రంజాన్ సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ముస్లింలు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



పొన్నూరు: పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేక ఓటుహక్కును వినియోగించుకోలేని దివ్యాంగులు, వృద్ధులు 85 ఏళ్లు నిండిన వారి సౌకర్యార్థం ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు ఆర్వో లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 3922 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకు సి విజిల్ ద్వారా 28 ఫిర్యాదులు అందగా వాటిలో 21 ఫిర్యాదులను పరిష్కరించినట్లు అన్నారు. సువిధ యాప్‌లో అనుమతుల కోసం 92 దరఖాస్తులు అందగా, వాటిలో 51 అనుమతులు ఇచ్చినట్లు, 28 దరఖాస్తులు తిరస్కరణకు గురై, 13 పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఫిర్యాదులపై 08643-242080, 297823 నెంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో లాయర్ మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

పెదకాకాని: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో నంబూరు కోటేశ్వరరావు అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన నంబూరు కోటేశ్వరరావు న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కువ సమయం మంగళగిరి కోర్టులో పనిచేస్తుంటారు. గుంటూరు కోర్టులో పనులపై వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో స్కూటీపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోకి చేరుకున్నాడు. జాతీయ రహదారిపై ఆయనను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నంబూరు కోటేశ్వరరావు(44) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శ్యామల, లహరి, అవంతిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రంజాన్ అతి పవిత్రమాసం



చల్లావారిపాలెంలో ఇఫ్తార్ విందులో పాల్గొని భోజనం వడ్డిస్తున్న బలసాని కిరణ్‌కుమార్



వెంగళాయపాలెంలో ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరి గౌతమ్‌రెడ్డి

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్

గుంటూరు రూరల్: రంజాన్‌మాసం పవిత్రమాసమని ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షను చేసి అల్లాను స్తుతించి ఆయన కృపను పొందటం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని చల్లావారిపాలెం గ్రామం అంకిరెడ్డిపాలెం రోడ్డులోని మసీదు వద్ద ముస్లింలు ఏర్పాటు చేసిన రంజాన్ పవిత్ర మాస ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మసీద్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర ఉపవాస దీక్షను చేసిన ముస్లింలకు దీక్ష విరమణ అనంతరం పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో ప్రజలంతా సంతోషంగా, సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ముస్లింలు, మత పెద్దలు, ముజావర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు..

గుంటూరు రూరల్: అభివృద్ధి సంక్షేమం జగనన్నకు రెండు కళ్లని, జగనన్న మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడనే నమ్మకంతో ఎందరో ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నల్లపాడు శ్రీనివాసకాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఓర్సు వేణుగోపాల్, తిరుపతి గురవప్ప, వీర్ల పెద్ద గురవయ్యలతోపాటు మరో 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. నగరంలోని వికాస్‌నగర్‌లోగల ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారిని పార్టీ కండువాను కప్పి సాదర స్వాగతం పలికారు.

కొర్నెపాడులో ఇఫ్తార్ విందు..

ప్రత్తిపాడు: ముస్లిం సోదరులు అత్యంత నియమ నిష్ఠలతో జరుపుకొనే పర్వదినం రంజాన్ అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో సోమవారం రాత్రి ముస్లింలు ఇఫ్తార్ విందును నిర్వహించారు. హాజరైన బలసాని కిరణ్‌కుమార్ తొలుత మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులతో ఉపవాస దీక్షను విరమింప జేసి వారి పండ్లు అందజేశారు. తదనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించి, పాల్గొన్నారు.

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ ..

గుంటూరు రూరల్: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ అని ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరి గౌతమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా డానియల్ అడిపి ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటూరి అంజిరెడ్డి, దుగ్గింపూడి యోగేశ్వర్‌రెడ్డి, షేక్ కరిముల్లా, అబ్దుల్ నబి స్థానిక ముస్లిం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



ప్రత్తిపాడు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ముట్లూరు దళితవాడకు చెందిన నక్క సుబ్బయ్య కుమారుడు నక్క అలెక్స్ (24) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన తండ్రి సుబ్బయ్యకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో, కుమారుడు స్వగ్రామమైన ముట్లూరుకు వచ్చి ఇక్కడే తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం తమ ఇంట్లో ఉన్న నీటి మోటారు పనిచేయకపోవడంతో అలెక్స్ మరమ్మతులు చేస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో అలెక్స్ అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

నేటి నుంచి అంకమ్మతల్లి ప్రతిష్టా మహోత్సవాలు



ప్రతిష్టా మహోత్సవాలకు ముస్తాబైన అంకమ్మతల్లి దేవాలయం

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 12 తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో తొలిరోజైన మంగళవారం గ్రామంలో కొలువై ఉన్న అన్ని ఆలయాల సందర్శన, సకల దేవతామూర్తులకు తాంబూల సహిత వస్త్ర బహూకరణ, 10వ తేదీ ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, రక్షాబంధనం, వాస్తుపూజ, అగ్ని మధనం, అగ్నిస్థాపన, హోమం, యంత్ర నమస్కారాలు, మంత్రం జపనుష్టములు, యజ్ఞశాల ప్రవేశం, అఖండస్థాపన, మృత్యం గ్రహణం, అంకురార్పణం, సాయంత్రం పోతురాజుల కొలువులతో మాతంగి వేషధారణలతో కొమ్ముడప్పుల నృత్యాలతో అంకమ్మతల్లి గ్రామోత్సవం, రాత్రి జలాధీశం నిర్వహించనున్నారు. 11న క్షీరాధివాసం, పంచామృతాధివాసం, నవగ్రహ ఆరాధన, ప్రధాన కలశవాహన, సొలార్పన, క్షీర తర్పణం, న్యాసకళ, 12వ తేదీన రత్నన్యాసం, ధాతున్యాసం, యంత్రస్థాపన, కలశ ప్రతిష్ట, అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, త్రిశూల స్వామి విగ్రహ ప్రతిష్ట, శ్రీ పోతురాజు స్వామి ప్రతిష్టా కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం మహాదాన కూష్మాండబలి, మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగానున్న మైదానంలో మహా అన్నప్రసాద కార్యక్రమం జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

కొండపాటూరు(కాకుమాను): ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న స్వయంభూ శ్రీ కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్లను అధికారులందరు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. మండలంలోని కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తిరునాళ్ల మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి అధికారి తిరునాళ్ల జరిగే మూడు రోజులు అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. పొన్నూరు సెబ్ సీఐ సుకన్య, ఎస్ఐ ఎస్.రవీంద్ర, దేవాలయ ఈఓ సురేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తుమ్మలపాలెంలో 12 మంది రాజీనామాలు సమర్పణ



పంచాయతీ కార్యదర్శి శివాజీకి రాజీనామా పత్రాలను అందిస్తున్న తుమ్మలపాలెం వలంటీర్లు

ప్రత్తిపాడు: వలంటీర్ల రాజీనామా పర్వం కొనసాగుతుంది. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. గ్రామ సచివాలయం పరిధిలో మొత్తం 14 మంది వలంటీర్లు విధులు నిర్వర్తిస్తుండగా, వారిలో సోమ వారం 12 మంది రాజీనామా చేశారు. తొలుత రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందించేందుకు మండల పరిషత్ కార్యాలయానికి రాగా, పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలని ఎంపీడీఓ కె. దుర్గాప్రసాద్ సూచించారు. దీంతో వారు తుమ్మలపాలెం సచివాలయంలో సెక్రటరీ శివాజీకి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. మిగిలిన ఇద్దరు కూడా నేడు రాజీనామా చేయనున్నట్లు తెలిపారు.

బీఎల్ఓల ద్వారా ఓటరు స్లిప్పులు

నగర కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి



రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన నగర కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ స్లిప్‌లను అందిస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి తెలియజేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్ఓల ద్వారా ప్రతి ఓటర్‌కు ఓటు స్లిప్ అందిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎవరైనా ఓటర్ల స్లిప్‌లు ఇవ్వాలి అంటే సదరు స్లిప్‌లో ఏ విధమైన రాజకీయ ప్రచారాలు చేయకూడదని, స్లిప్‌లో రాజకీయ పార్టీల గుర్తులు, రంగులు ఉండకూడదని తెలిపారు. స్లిప్‌లో కేవలం ఓటర్ పేరు, పోలింగ్ కేంద్రం పేరు, ఓటర్ల లిస్టులో సీరియల్ నంబర్ ఉండాలని పేర్కొన్నారు. నామినేషన్ ఫారాలను ముందస్తుగా కొన్ని అందిస్తున్నామని, వాటిని సమగ్రంగా పరిశీలించాలన్నారు. నామినేషన్ వేయడానికి ముందే రిటర్నింగ్ అధికారి ఆధీకృత సిబ్బందితో చెక్ లిస్టు మేరకు తగిన పత్రాలు ఉన్నదీ లేనిదీ పరిశీలన చేయించుకుంటే నామినేషన్ రిజెక్ట్ కాకుండా ఉంటుందన్నారు. ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరిండెంట్ పద్మ, కె.దివాకర్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై అవగాహన అవసరం

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పీడబ్ల్యూడీ(హోం ఓటింగ్) ఓట్లపై బీఎల్ఓలు, సెక్టార్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి చెప్పారు. సోమవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు, సెక్టార్, రూట్ అధికారులతో హోం ఓటింగ్, ఓటింగ్ శాతం పెంపు, ఇతర ఎన్నికల విధులపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతనంగా అమలు చేయనున్న పర్సన్ విత్ డిజేబుల్ (హోం ఓటింగ్) పై ప్రతి బీఎల్ఓ, సెక్టార్ అధికారి సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. హోం ఓటింగ్‌కు ఎంపిక చేసిన వారి వివరాలు ఫారం 12డీ ద్వారా రిటర్నింగ్ అధికారికి ముందుగానే అందించాలని, ఓటింగ్ కి సంబంధించి స్థానిక పీఓ, మైక్రో అబ్జర్వర్, మరొక పీఓ, వీడియో గ్రాఫర్ సమక్షంలోనే జరుగుతుందని తెలిపారు. ఏఆర్ఓలు ప్రదీప్ కుమార్, సునీల్, భీమరాజు, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరిండెంట్ పద్మ, మాస్టర్ ట్రైనర్ రవి, సెక్టార్, రూట్ అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







